వెదజల్లే పద్ధతి రైతులకు మేలు



గొల్లపల్లి సమీపంలో వెదజల్లే పద్ధతి ద్వారా వరిసాగు చేస్తున్న రైతు

- వరిసాగులో రైతులకు అవగాహన అవసరం
- కూలీల సమస్యతో పాటు డబ్బులు ఆదా
- ఉమ్మడి మండలంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోపాల్‌పేట: ప్రస్తుతం వానాకాలం సాగు పూర్తయ్యి రైతులు వడ్లు అమ్మారు. కొంతమంది రైతులు ఇప్పటికే కరిగెట్లు ప్రారంభించారు. ఈ క్రమంలో రైతులు వరిపంట మూస పద్ధతి ద్వారా సాగు చేయాలంటే ముందు నేల తయారు చేయడం, విత్తనాలు నాన బెట్టి నాటడం, కలుపు ఇలా ప్రతి పనికి కలిపి సుమారు ఎకరానికి రూ.20వేల వరకు ఖర్చు అవుతుంది. దీనికి తోడు కూలీలు సమయానికి దొరకక రైతుల ఇబ్బందులు చెప్పలేని విధంగా ఉంటాయి. నాటు వేసే పద్ధతి ద్వారా కాకుండా రైతులు వరి విత్తనాలు వెదజల్లడం, లేదా విత్తన గొర్రు ద్వారా సాగు చేస్తే రైతు ఎకరానికి సుమారు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు మిగులుబాటు అవడంతో పాటు కూలీల ఇబ్బందుల నుంచి రైతు గట్టెక్కవచ్చని అధికారులు చెబుతున్నారు. గతేడాది వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించడంతో ఉమ్మడి మండలంలో సుమారు 200 ఎకరాలకు పైగా రైతులు వెదజల్లే పద్ధతి ద్వారా వరి పంట సాగుచేసుకున్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇలా సాగు చేయడం ద్వారా పంట దిగుబడి సైతం పెరుగుతుందని అవగాహన కల్పిస్తున్నారు.

విత్తన గొర్రు పద్ధతి

విత్తన గొర్రు పద్ధతిలో శుద్ధిచేసిన విత్తనాన్ని చదును చేసిన పొలంలో నాగటి సాలు వెనక లేదా గొర్రు, ట్రాక్టరుతో నడిచే ఎరువులు, విత్తనాన్ని ఒకే సారి చేసే ఫర్టికం సీడ్ డ్రిల్ సాళ్లలో విత్తనాలను మట్టి కప్పే విధంగా చూసుకోవాలి. ఎరువుల పరంగా చూస్తే మూస పద్ధతి కన్నా నత్రజని 25 శాతం ఎక్కువగా వేసుకోవాలి. ఈ పద్ధతిలో ఇనుప దాతు లోపం వచ్చే అవకాశం ఉంటుంది. ఆకులు తెల్లగా పాలిపోయి పంట ఎదుగుదల కుంటుపడినట్లు అయితే లీటరు నీటికి ఐదు గ్రాముల అన్నబేది, గ్రాము నిమ్మ్మప్పు కలిపి అవసరాన్ని బట్టి రెండు లేదా మూడుసార్లు పిచికారి చేసుకోవాలి. కలుపు యాజమాన్యంలో నేరుగా విత్తిన వరిలో పంట విత్తిన 45 రోజుల్లో కలుపు రాకుండా జాగ్రత్త పడాలి. కలుపు నివారణకు బిస్ ఫైరి బ్యాంక్ సోడియం 100 నుంచి 120 మిల్లీలీటరు కలిపి ఎకరాకు పిచికారి చేయాలి. తొలకరి వర్షాలకు విత్తుకోవడం వల్ల జూన్, జులై, ఆగస్టు మాసాల్లో కురిసే వర్షాలకు నీరు సరిపోతుంది. వర్షాలు పదిహేను రోజుల వరకు కురవకుంటే నేల స్వభావాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి.

వెదజల్లే పద్ధతి ద్వారా

వెదజల్లే పద్ధతిలో రైతులు మామూలుగా కరిగెట చేసిన తర్వాత ఎకరానికి 15కిలోల ధాన్యం 24 గంటలు నానబెడితే మొలక చిన్నగా ప్రారంభం అవుతుంది. అలా అయిన మొలకలను కరిగెటలో ఎకరానికి 15 కిలోలు చల్లాలి. ఈ పద్ధతిలో ఎక్కువ ఎత్తు పెరగని రకం చల్లే జాగ్రత్త పడాలి. వ్యవసాయ అధికారుల సూచనలు ఎప్పటికప్పుడు తీసుకుని సాగు చేయడం ద్వారా కూలీల ఇబ్బందులు లేకుండానే సుమారు ఎకరానికి రూ.8వేల వరకు మిగులుతాయని అధికారులు చెబుతున్నారు.

కూలీల బెడద తప్పుతుంది



నేను 4ఏళ్లుగా పొలంలో వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్ ద్వారా పంట సాగు చేస్తున్నాను. 8 ఎకరాలు వెదజల్లే పద్ధతి, 4ఎకరాల్లో డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా సాగు చేశాను. పని, ఖర్చు తగ్గుతుంది. దీంతో పాటు ముఖ్యంగా కూలీల బెడద తప్పుతుంది. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల ద్వారా సలహాలు తీసుకుని వారు చెప్పిన విధంగా చేస్తున్నాను. తక్కువలో తక్కువ ఎకరానికి రూ.8వేల వరకు మిగులుతోంది.

– నిరంజన్ రావు, గొల్లపల్లి

రైతులకు ఎంతో మేలు



రైతులు వెదజల్లే పద్ధతి ద్వారా పంటసాగు చేస్తే వారికి ఎంతో పని తగ్గుతుంది. దీంతో పాటు ఖర్చు తగ్గడం, దిగుబడి పెరగడం, కూలీల ఇబ్బంది తలెత్తకుండా ఉంటుంది. అలాగే విత్తన గొర్రు పద్ధతి ద్వారా కూడా రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. రైతులు గతేడాది 150 ఎకరాల వరకు సాగు చేశారు. ఈ ఏడాది మరింత ఎక్కువ మంది రైతులు ఈ పద్ధతి పాటించేలా అవగాహన కల్పిస్తున్నాం. ఈ సారి మరింత మంది రైతులు ఈ పద్ధతులు పాటించే అవకాశం ఉంది.

– అనిల్‌కుమార్, ఏఓ, రేవల్లి మండలం

ఆరు గ్యారంటీలపై హర్షం



ఆత్మకూర్ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేస్తున్న మహిళలు

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలు అమలు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సుల వద్ద మహిళలతో కలిసి సంబరాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణంచేసే వెసులుబాటు కల్పించడం ఆర్థికంగా ఎంతో మేలు కలుగుతుందని కాంగ్రెస్ నాయకులు అనిత, విజయలక్ష్మి, మహాబూబబీ, సునీత అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.10లక్షలతో ఉచితంగా వైద్యసేవలు అందనున్నాయని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, తులసీరాజ్‌యాదవ్, రహ్మతుల్లా తెలిపారు.

హామీని నిలబెట్టుకున్న సీఎం

ఖిల్లాఘనపురం: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్కాగా నెరవేరుస్తారని మాజీ ఎంపీపీ వెంకటయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రారంభించారు. రమేష్, బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం సంతోషం



మస్తిపురం నుంచి బయలుదేరుతున్న బస్సు

అమరచింత: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఎంతో సంతోషమని మహిళా ప్రయాణికులు తెలిపారు. నాగల్‌కడ్మూర్, మస్తిపురం నుంచి ఆర్టీసీ బస్సులలో శనివారం మహిళా ప్రయాణికులతో మరికల్– వనపర్తి, గద్వాల్ గమ్యస్థానాలకు తీసుకెళ్లారు.

మహిళలకు మేలు



మన ప్రాంతానికి చెందిన రేవంత్‌రెడ్డి సీఎం అవుతుండడంతో మా ప్రాంతం రూపురేఖలు మారబోతున్నాయని విశ్వశిస్తున్నాం. ముఖ్యంగా ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 వంటగ్యాస్ ఎంతో ఉపయోగపడనుంది. మహిళలు ఎంతో సంతోషంగా ఉచిత ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారు.

– అనిత, బాలకిష్టాపూర్, ఆత్మకూర్

సీఎం హామీతో మహర్దశ



ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని, వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తామని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలసి రేవంత్‌రెడ్డి ఎన్నికల సభలో ప్రకటించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఆత్మకూర్‌కు మహర్దశ రావడం ఖాయం.

– రహ్మతుల్లా, ఆత్మకూర్

రూపురేఖలు మారుతాయి



కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావ్ వారి ప్రాంతాలను ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నారు. సిద్దిపేటలో వెయ్యి పడకల ఆస్పత్రిని నిర్మించుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌ను పూర్తిగా విస్మరించారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మహర్దశ రాబోతుంది. ఆత్మకూర్‌కు అన్ని రకాలుగా మేలు కలగనుంది.

– గద్దంశ్రీనివాస్‌యాదవ్, ఆత్మకూర్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి పరుగులు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

వనపర్తిటౌన్: త్వరలోనే మాజీ మంత్రి చిన్నారెడ్డికి సముచిత స్థానం లభిస్తుందని.. చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డిలతో వనపర్తి అభివృద్ధిలో పరుగులు పెట్టనుందని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పీసీసీ సభ్యుడు కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్‌లో విభేదాలు లేవని, అందరం ఐక్యంగా ఉన్నామని.. చిన్నచిన్న పొరపాట్లను సర్దుకుంటామన్నారు. 45 ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకొని రాజకీయం చేస్తున్న చిన్నారెడ్డికి పార్టీ అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అర్హులందరి దరికి చేర్చేలా కృషి చేస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ మత్స్యకార విభాగం చైర్మన్ నందిమల్ల యాదయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముదిరాజ్‌లను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నాయని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చేలా చొరువ చూపాలని కోరారు. అంతకు ముందు డీసీసీ కార్యాలయంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీసెల్ రాష్ట్ర నాయకుడు ఖమ్మర్ మియా, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గోర్ల జానకీరాములు, గంధం లక్ష్మయ్య పాల్గొన్నారు.

మూడు వర్గాలుగా విడిపోయి..

జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మూడు వర్గాలుగా విడిపోయి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌చౌక్‌లో, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు. ఒకరి నిర్వహణలో మరొకరు జోక్యం చేసుకోకుండా ఎవరికి వారు కార్యక్రమాలు నిర్వహించడంతో కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అదేవిధంగా మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవానికి సంబంధించి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధికారిక కార్యక్రమంలో పాల్గొనగా, సీనియర్ నాయకులు వేరుగా బస్టాండ్‌లో వేడుకలు నిర్వహించారు.

మహిళలకు రూ.2,500 ఇవ్వాలి

పెబ్బేరు రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణహామీ అమలు చేయడం సంతోషకరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ తెలిపారు. శనివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు ఉచిత ప్రయాణం ఎంతో ఆర్థిక ఊరటను ఇస్తుందని తెలిపారు. ఆరు గ్యారంటీల్లో భాగమైన మహిళలకు నెలకు రూ.2500 నగదు, రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీలను కూడా త్వరలోనే అమలు చేయాలన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



అమరచింత: క్రిస్మస్ పండుగను పురస్కరంచుకుని పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు వైడూర్య, ఆదాం నిరుపేద క్రైస్తవ మహిళలు, వితంతువులు, పాస్టర్లకు నూతన వస్త్రాలను శనివారం పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ గోపి వాటిని అందించారు.

గర్భిణులకు అవగాహన



వీపనగండ్ల: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత వల్ల నష్టాలు తెలిపారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారులు వంశీకృష్ణ, రాజశేఖర్ అన్నారు.

కాలనీల్లో కుక్కల బెడద నివారించాలి



పాన్‌గల్: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కుక్కలు గుంపులుగా సంచారిస్తుండటంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. కుక్కలు సంచారిస్తూ చిన్న పిల్లలు, పెద్దలపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయని కాలనీవాసులు తెలుపుతున్నారు. పంచాయితీ వారు స్పందించి కాలనీల్లో కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.

దేవరకద్ర ఎమ్మెల్యేకు ఘనస్వాగతం



కొత్తకోటలో ప్రజలకు అభివాదం తెలుసుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట: దేవరకద్ర ఎమ్మెల్యేగా విజయం సాధించిన మధుసూదన్‌రెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పట్టణానికి రావడంతో నాయకులు ఘనస్వాగతం పలికారు. గ్రామాల్లోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. ప్రధాన రోడ్లన్ని జనంతో నిండిపోయాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై, కాంగ్రెస్‌పై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలుకు కృషి చేస్తానన్నారు. పార్టీ కార్యకర్తలకు, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవకుడిలా పని చేస్తానన్నారు.

ఇష్టానుసారంగా గ్రంథాలయ నిర్వహణ



తాళం వేసి ఉన్న జిల్లా గ్రంథాలయం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో కొత్తగా ప్రారంభమైన జిల్లా గ్రంథాలయ భవనం సమయపాలన పాటించడం లేదని పాఠకులు, నిరుద్యోగులు వాపోతున్నారు. పనిదినాలలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, సెలవుల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తెరవాలని, సమయ పాలన లేకుండా జిల్లా ప్రారంభించిన నాటి నుంచి ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకే తెరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో శనివారం గ్రంథాలయాన్ని తెరవమని అధికారులు చెప్పడంతో కొందరు ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అధికారులు స్పందించాలని కోరారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలను పెద్దమందడి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పాలాభిషేకం చేయడంతో పాటు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో రఘుప్రసాద్, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, రమేష్, సత్యన్న తదితరులు ఉన్నారు.

కొత్తకోట: పట్టణ కేంద్రంలో మండల ఎలక్ట్రిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తకోట చౌరస్తాలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బోయేజ్, గొల్లబాబు, బీచుపల్లియాదవ్, మన్యం, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్

మదనాపురం: మండల కేంద్రంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘ నంగా నిర్వహించారు. తెలంగాణ ఇచ్చి ఎన్నో ఏళ్ల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత సోనియాగాంధీకే దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగన్న, జగదీ ష్, చుక్క రవికుమార్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం,పెబ్బేరు, వనపర్తి మండల కేంద్రంలోని శనివారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాములుయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి , శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: స్థానిక ఇందిరాగాంధీచౌక్‌లో సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్‌చేసి సంబరాలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, తులసీరాజ్, రహ్మతుల్లా, పరమేష్, అనిత, గణేష్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

అమరచింత: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, మహేందర్ రెడ్డి, విష్ణు, వెంకట్‌రెడ్డి, జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీరయ్యయాదవ్, గంగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

చిన్నంబావి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు మంత్రి జూపల్లి కృష్ణారావు సతీమణి సృజన, సోదరి పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



కొత్తకోటలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ఆత్మకూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేప వంటకాల పేరిట మద్యం అమ్మకాలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వలో ప్రతి సంవత్సరం ఈత కోసం వెళ్లిన యువకులు మద్యం మత్తులో నీటి ప్రవాహానికి కొట్టుకుపోతు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఎడమ కాల్వ సమీపంలో చేప వంటకాల తయారీ ఉండటంతో ప్రాజెక్టు సందర్శనార్థం వస్తున్న పర్యాటకులతో పాటు సమీపంలోని ఆయా గ్రామాల యువకులతో నిత్యం కిటకిటలాడుతుంది. వీటికి తోడు కొంతమంది అక్రమంగా మద్యంను చేప వంటకాల గుడారాల్లో విక్రయిస్తుండటంతో రోజురోజుకు సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. మద్యం మత్తులో కాల్వలో దిగే ప్రయాత్నాలు చేస్తున్నారు. నాలుగేళ్ల కిందట మద్యం విక్రయాలపై చర్యలు తీసుకున్న యంత్రాంగం ప్రస్తుతం పట్టించుకోవడం లేదు.

క్లుప్తంగా

పగలే వెలుగుతున్న వీధి దీపాలు



పాన్‌గల్: మండల కేంద్రంలోని వీధి దీపాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పలు కాలనీల్లోని వీధి లైట్లు పట్టపగలే వెలుగుతూ విద్యుత్ వృథా అవుతుంది. కొన్ని కాలనీల్లో రాత్రి వేళలో వెలగకపోగా కొన్ని కాలనీల్లో పట్టపగలే వెలుగుతున్నాయి. వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ లేక పట్టపగలే వెలుగుతున్నాయని పంచాయతీ వారు పేర్కొంటున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా ఏమాత్రం స్పందించడంలేదని తెలుపుతున్నారు.

భీమా కాల్వలో పేరుకుపోయిన జమ్ము



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి సమీపంలోని భీమా కాల్వలో జమ్ము, పిచ్చిమొక్కలు పేరుకపోవడంతో చివరి గ్రామాలకు సాగునీరు సక్రమంగా చేరడంలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం రైతులు వరి నాట్ల కోసం తూకాలు పోస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాల్వలో పేరుకపోయిన జమ్ము, పిచ్చిమొక్కలను ఉపాధిహామీ పథకం ద్వారా తొలగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉసిరి చెట్టు కింద వనభోజనాలు



కొత్తకోట రూరల్: మండలంలోని ఆమడబాకులలో కొన్ని కుటుంబాలు గ్రామంలోని మామిడి తోటలో గల ఉసిరిచెట్టు కింద వనభోజనాలు చేశారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేసి అక్కడే భోజనాలు చేస్తే అశ్వమేధ యాగం చేసినంత ఫలితం దక్కుతుందని, అదేవిధంగా కార్తీకమాసంలో మహావిష్ణువు, లక్ష్మీదేవి ఉసిరి చెట్టులో కొలువై ఉంటారని ప్రజల నమ్మకం.

హజ్ యాత్రికుడికి సన్మానం



వనపర్తి టౌన్: హజ్ యాత్ర పుణ్యప్రదమని, జీవితంలో ఒక్కసారైన ఈ యాత్ర చేయాలని ముస్లింలు కోరుకుంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అనీస్, బీఆర్ఎస్ నాయకుడు గులాం ఖాదర్ ఖాన్ అన్నారు. పట్టణానికి చెందిన అలీం హజ్ యాత్రకు ఎంపిక కావడంతో శనివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో పూలమాల, శాలువాతో సన్మానించారు.

అయ్యప్ప భక్తుల ప్రత్యేకపూజలు



ఆత్మకూర్: కార్తీకమాసం చివరి శనివారం సందర్భంగా అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగంపేట శివారులోని అడవి ఆంజనేయస్వామి ఆలయంవద్ద పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో నిత్యం పూజా కార్యక్రమాలతోపాటు మాలధారులకు అన్నదానం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రఘు, శ్రీను, శ్రీకాంత్, బాలు, భరత్, బాబు, నరేష్ రెడ్డి, పాండు, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–3 కేంద్రంలో శనివారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు టీచర్ మంజులారాణి తెలిపారు. ఆరు నెలల చిన్నారులను తమ కేంద్రానికి తీసుకొచ్చి అన్నప్రాసనం, అక్షరాభ్యాసం చేయించామన్నారు. కార్యక్రమంలో గీతాంజలి, మహేశ్వరి, జయసుధ, పరమేశ్వరి, అజీరాబేగం, పర్వీన్ బేగం పాల్గొన్నారు.